# ప్రేమంటే?

## సురేఖ

"మేన్ కెనాట్ హైడ్ టూథింగ్స్, వన్ దట్ హి ఈజ్ ఇన్ డ్రింక్ ఎండ్ ద అదర్ వన్ దట్ హి ఈజ్ ఇన్ లవ్"

"సో, నువ్వు ప్రేమలో పడ్డావని చూడగానే తెలుస్తుంది. ప్లీజ్ చెప్పరా ఆ అదృష్టవంతురాలెవరో?"

"లీవ్ మి ఎలోన్ నేనెవర్నీ ప్రేమించడంలేదు. అసలామాటకి అర్థం కూడా నాకు తెలీదు" విసుగ్గా మొహం తిప్పుకున్నా. ఆ క్షణానికి రమేష్‌ని తప్పించుకున్నా నా మనసుముందుమాత్రం ఓడిపోతున్నా.

అసలు ప్రేమంటే?

ఇలా ప్రతిక్షణం ఆమె ఆలోచనల్లో బతికెయ్యడమా? ప్రతి అణువులోనూ ఆమెనే చిత్రించుకోడమా? చిన్న అలికిడికి సైతం తత్తరపడుతూ ఆమె పదసవ్వడినే ఊహించుకోడమా?

ఛ, ఇవేం కాదు. మరి? ఏమో?

"శేఖర్ భోంచేసావా?" అదిగో ఆమె తియ్యని గొంతు.

"లేదండీ"

"చదూకుంటున్నావా?"

"ఆ" అందమైన అబద్ధం.

నింగీ నేలకీ మధ్య పల్లకీలో నిన్ను లాలిస్తూ, సుందరమైన నీ రూపాన్ని మేఘాల కేన్వాసు మీద చిత్రిద్దామంటే వద్దంటావేమి? అయ్యో, నాకు మతిపోయింది. 'కుంచె'ని 'ప్రేమ' అనే వర్ణంలో ముంచడం మర్చిపోయా.

"పోన్లే ఈ కూర వేసుకు తిను" గిన్నెపెట్టి వెళ్ళిపోయింది. ఆమె, సరళ! నాకన్నా ఐదేళ్ళు పెద్ద. విడో. చూట్టానికి నాకన్నా ఐదేళ్ళు చిన్నదిలా అన్పించేటంత నాజూగ్గా వుంటుంది.

ఆమె ఓ రెండు మూడు బేచెస్‌కి కుట్లు, అల్లికలు నేర్పుతుంది. ఇవికాక ఇంటి అద్దెలు, ఇవే ఆమె జీవనభృతి.

నేను ఆంధ్రా యూనివర్సిటీలో ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చేస్తున్నా. ఆ ఇంట్లో ఓ గదిలో అద్దెకుంటున్నా. నా రూమ్మేట్ రమేష్ నైట్ కాలేజ్‌లో చదవడంవల్ల నాకు, వాడికి టైమింగ్స్ ఎడ్జస్ట్ అవ్వక 'రూమ్‌కీస్' ఆమె దగ్గరే ఉంచడం, ఆమెతో నా పరిచయానికి నాందిపల్కింది.

ఎటూ తేల్చుకోలేక పోతున్నా. అయినా ఈమెతో ప్రేమేంటి? అందులోనూ విడో! అదీకాక వయసులో అంతరం. నా మనసేంటో నాకే అర్థం కాదు.

ఉదయం తొమ్మిదవుతోంది. మామూలుగా 'కీస్' తీస్కొని ఆమె గదికి వెళ్ళా తలుపుతీసింది. లయతప్పుతోన్నట్లు గుండెచప్పుళ్ళు. లోకాన్ని మర్చిపోయి తన్మయంగా ఆ కళ్ళల్లోకే తదేకంగా చూడాలన్న తపన.

ఆలోచనల్ని ఆర్పేసి నిశ్శబ్దంగా మిగిలిపోయిన మనసు

మాటల్ని మర్చిపోయి ఏదో మైకంతో మూగబోయిన గొంతు. బహుశా ఇదేనేమో ప్రేమంటే.

'కీస్' ఆమె చేతిలో పెట్టా. ఈ ఇంట్లో అడుగుపెట్టిన నాటినుండీ నాలో కడలి కెరటంలా ఎగిసిపోతోన్న ఒకేఒక్క కోర్కె అది...

సుకుమారమైన ఆ చేతిని నా చేతిలోకి తీస్కొని "నీకు నేనున్నానవే" ఫీలింగ్ వచ్చేలా అతి మెతారంగా నొక్కి మృదువుగా విడిచిపెట్టాలని.

కెరటం ఒడ్డుని తాకి చల్లారిపోయినట్లే, నా కోర్కెసైతం, పలకరింపుగా ఆమె నవ్విన నవ్వుతో ముడుచుకుపోతుంది.

యూనివర్సిటీ కేంపస్, ఉడాపార్కు, బీచ్, జగదాంబా జంక్షన్, కాలేజ్ టవున్ విశాఖలో అందమైన అమ్మాయిలకేం కొదవలేదు.

ఎక్కడ ఏ మెరుపుతీగని చూసినా కల్గని విచిత్రమైన కలవరం కేవలం ఈమె సమక్షంలోనే ఎందుకని?

సాయంత్రం ఆరవుతోంది. అలవాటుగా ఆ గదివేపు దృష్టిసారించా. గదికి తాళం. ఎక్కడ కెళ్ళుంటుదబ్బా!

పక్క బామ్మగార్నడిగా. ఆవిడ ఆశ్చర్యంగా చూస్తూ

"ఆ ఏవుంది! ఆ సముద్రపుటొడ్డున కూచుంటుంది" అంది ఈసడింపుగా.

మా ఇంటికి దగ్గరగా వున్న 'సీషోర్' వైపు అనుకోకుండానే నా అడుగులు కదిలాయి.

తొంగిచూసే సూరీడు, తొందరపెట్టే మేఘాలు, ఒంటరిరాయి, చుట్టూ నీళ్ళు ఆ రాతిపై ఆమె.

ఎగుర్తోన్న పైటను తన కింపుగా లాక్కుంటూ ఏదో రాస్తోంది. ఆమెకెదురుగా పోయి కూచున్నా, నాచుపట్టిన రాతిని వేళ్ళ కొసల్తో తాకుతూ.

ఈ రోజేందుకో ప్రకృతి అందంగా అన్పిస్తుంది. అసలెప్పుడూ అలానే వుంటుందేమో. ఆహా కాదు సుమా! ఆమె సమక్షమే అంతందాన్ని ఆపాదించింది.

తన చేతిలో పుస్తకాన్ని తీసి నా వళ్ళో పెట్టింది.

"ప్రార్థన" ఒక్కో పేజీ తీసి చదివా. సన్నగా, పొడుగ్గా ఉన్న అక్షరాల్తో, పదాల మధ్య ఫింగర్ గేప్‌తో, మధుర మనోజ్ఞ భావాల అల్లిబిల్లి అల్లిక.

అందులో...

"మంకెన పూలని, పారిజాతాన్ని పదిలంగా మోసుకొచ్చి, నింగీ నేలకీ మధ్య పల్లకీలో నిన్ను లాలిస్తూ, సుందరమైన నీ రూపాన్ని మేఘాల కేన్వాసు మీద చిత్రిద్దామంటే వద్దంటావేమి? అయ్యో, నాకు మతిపోయింది. 'కుంచె'ని 'ప్రేమ' అనే వర్ణంలో ముంచడం మర్చిపోయా.

ప్రభూ, ఆమనిలా వచ్చి మళ్ళీ నాకు కొత్త యవ్వనాన్ని ప్రసాదించావు. నాకీ శక్తి చాలు. తిరిగి ఈ జీవితాన్ని మొట్ట మొదటి తెరనుండీ మొదలెట్టి ఉత్సాహంగా అప్పుడే ఆరంభించినట్లు నీ రాకకై ఎదురుచూట్టాన్కి.

తదేకంగా నీవు గీసిన సుందర చిత్రంలో నేనో వారిగిపోయిన వర్ణాన్ని మాత్రమే. తన్మయంగా నీవు రచించిన కావ్యంలో ఓ పనికిరాని పాత్రని మాత్రమే.

నా స్వామి, అంతా మిథ్య అన్న ఆలోచనకన్నా సర్వం నీవే అన్న తలంపే నన్ను ఆనంద డోలికల్లో ఊపుతోంధి?

నీ ఉనికి సూదిమొనంత అయినా చాలు నా చిన్ని గుండెని ఓలలాడటాన్కి

ఎంత భావుకత! సృష్టికర్తని స్తుతిస్తూ ఆ ఆరాధనలో తన్మయం చెందిన భక్తురాలి 'ప్రార్థనా'?, ఓ పిచ్చిప్రేయసి, విరహవేదనా? ప్రకృతి అందాల్ని పారవశ్యంగా అలపిస్తోన్న భావకుని మధురగీతమా?

"ఈ రెయిన్‌బో చూస్తే నీకేమనిపిస్తోంది? శేఖర్!'

"సౌందర్యాన్ని చూసి ఆస్వాదించటమే కానీ ఎక్స్‌ప్రెస్ చేసేటంత నేర్పు నాకులేదు మీలా?

నా మాటకి ఆమె నవ్వుతోంటే పాలపొంగులా పొంగుతోన్న కెరటాలపై సంధించిన సూర్యకిరణాలు పరావర్తనం చెంది ఆమె ముత్యాల పలువరసపై నుండి వెన్నెలలా జారిపోయాయి.

'పగలే వెన్నెల' అంటే ఇదేనేమో.

"మరి మీకు?" అన్నా తేరుకుంటూ.

"ఇంద్ర ధనస్సులోని రంగులన్నీ దారాలుగా చేసి నా ప్రేయసి మేలిముసుగు నల్లాలనే నా వ్యర్థ ప్రయత్నం చూసి ఫక్కున నవ్వింది నీ రెండ" ప్రార్థనలో ఇంకో జలతారు జాపనీ వోటు వేస్కుంది.



ఇంతటి జ్ఞానదీపం ఒంటరిగా మిగిలిపోకూడదు. ఏతోడూలేకా ఆరిపోకూడదు. ఆ చమురు నేనే కావాలి.

సరళని నాదానిగా చేస్కోవాలనే తీర్మానించుకున్నా. సమాజం వచ్చిపోతున్నా లోకులు కాకులైపోయినా.

ఆ సంవత్సరంతో నా చదువు పూర్తయింది. నా మెరిట్, నాన్నగారి ఇన్‌ఫ్లూయన్స్ నన్ను సెంట్రల్ పి.డబ్ల్యు.డిలో ఇంజనీర్‌గా చేర్చాయి. ఫస్ట్ పోస్టింగ్స్ అస్సాప్.

జాయిన్ అయ్యాక వచ్చి 'స్వీట్ సర్‌ప్రైజ్'గా సరళకీమాటచెప్పి నాతో తీస్కెళ్దామనుకున్నా. కానీ తర్వాత ఆమె నాక్కన్పించలేదు.

తర్వాత ఓ రెండేళ్ళలో నాకు పద్మతో పెళ్ళి, ఇద్దరు పిల్లలు. ఎంత సంపాదించినా, ఎంత కీర్తి పొందినా, ఎన్ని సాధించినా ఏదో వెల్తి.

జీవితంలో ఏనాడైనా సరళని చూస్తాననే వెర్రి ఆశ. పద్మ చనిపోయినప్పుడు బాధపడ్డాను. కానీ అది సాటి వ్యక్తికి దూరమయ్యాననే భావనే తప్ప ఇంకే ప్రత్యేకతా ఆపాదించుకోలేదు.

ఆ శూన్యత, అరికమైన హృదయం సరళ దూరమైన నాటినుండీ నాతోపాటే కల్సిపోయాయి తప్పా ఆ తర్వాత ఆ అగాధాన్నెవరూ పూడ్చలేకపోయారు.

ఎ.వి.ఎస్ టవున్‌లో ఉన్న 'శ్రీవసీ హోమ్స్'ని దాటిపోతోంటే గుర్తొచ్చింది. పనిపిల్ల రోటరీ ఫండ్స్ కోసం ఎంక్వయిరీ చెయ్యమనడం.

ఓ వైపునుండి మార్దవంగా రామాయణం గానం చెయ్యడం విన్పిస్తోంది.

ఆ కంఠం నాకు బాగా పరిచయమైనదే. ఎప్పటినుండీ అంటే "ఏడమ్, ఈవ్‌లు ఈ భూమ్మీద పడకమునుపు నుండీ, అసలీ విశ్వం ఓ రూపును సంతరించుకోక ముందునుండీ నా ఊపిరిలో ఊపిరిగా, ప్రాణంలో ప్రాణంగా నాలో మిగిలిపోయిన ఓ మధుర స్మృతి.

నా హృదయ సామ్రాజ్యాన్ని ఇప్పటికీ శాసిస్తోన్న ఓ మహారాజ్ఞి 'మెజెస్టిక్ వాయిస్'

ఆ కంఠం విన్పిస్తోన్న దిక్కుగా దృష్టి సారించా. నా అడుగుల సవ్వడికి తలెత్తి ఆమె చూసింది.

ఆ చూపులో ఏ శక్తి వుంది? అది విద్యుత్తులా నా అణువణువును పులకింపచేస్తోంది.

అపురూపమైన ఆ చిర్నవ్వే నా మనసు పొరల్ని దాటి అట్టడుగున నిద్రపోతోన్న అనుభూతుల్ని తట్టిలేపుతుంది.

మైండ్ అంతా బ్లేంక్ అయి, గొంతు మూగవోయి, హృదయం సంతోషసాగరంలో తానమాడుతోంటే.

ఏ చిన్న క్షణం వృధా అయినా ఆమె ఎక్కడో చేజారిపోతుందోనని, ఎక్కడ అదృశ్యమవుతుందోనని ఆర్తిగా, తమకంగా ఆమె రూపు నేరెప్పలార్పడం మర్చిపోయి చూస్తోంటే.

ఆమె తన కొంగుతో కళావిహీనమైన మోమును కప్పాలనే విఫల ప్రయత్నం చేస్తోంది.

ఆమె నా సరళ.

"ప్యూర్ లవ్ జనరేట్స్ ఫ్రమ్ ఎఫెక్షన్, బట్ నాట్ ఫ్రమ్ ఎట్రాక్షన్"

కెరటంలా ఎగిసిపడ్తోన్న చిన్నప్పటి కోర్కెని ఈసారి అణచాలని ప్రయత్నించలేదు. చేతిని ముందుకు సాచా. భయంగా తనని తాను వెనక్కు లాకుంటోన్న సరళని వారిస్తూ 'నీకు నేనున్నాను సుమా!' అన్న ఫీలింగ్ వచ్చేలా సుతారంగా తాకాను.

ఆమె కంటినుండి రాలిన ఓ కన్నీటి బొట్టు ఎండిపోయిన చెక్కిలి మైదానాన వర్షించి నా చేతిమీదుగా జారిపోతూ ఓ ముత్యపు చినుకులా రిఫ్లెక్ట్ అయింది.

ఆ చేతినందుకున్నాక నా కళ్ళల్లో లోకాన్ని జయించినంత తృప్తి.

ప్రేమంటే? ఎవరికి వారు స్వయంగా అనుభవించాల్సిన 'స్వీట్ నథింగ్స్' 'ఇట్ కాంట్.బి డిస్క్రైబ్డ్ ఇన్ మియర్ వర్డ్స్'?

*



## గొప్పలు

"మా వారు తలుచుకుంటే ఒకేసారి యాభైమందిని చంపగలడు తెలుసా" అంది ఆర్టీసీ డ్రైవర్ భార్య.

"ఓస్ అంతేనా మావారు తలుచుకొంటే ఒకేసారి వెయ్యిమందిని చంపగలరు" అంది గర్వంగా రైలు ఇంజన్ డ్రైవర్ భార్య.


"మీ ఇద్దరికంటె నేనేగొప్ప మావారు తలుచుకొంటే రోజుకు లక్షమందిని చంపగలరు" అని మరింత గర్వంగా చెప్పింది టీ.వి అనౌన్సర్ భార్య.

—జి.రవిప్రభాస్ (ద్రోణావలం)



# మమ్మీ డాడీలను దహనం చెయ్యవద్దు వాళ్ళు బాధపడతారు

తన కన్నవాళ్ళని హత్యచేసిన వాళ్ళ మీద ఎప్పుడో ఒకప్పుడు కసి తీర్చుకుంటామని శపథం చేస్తారు సినిమాలలో హీరో హీరోయిన్లు. తనూ అంతే అంటోంది శ్రీ శంకర్ దయాళ్ శర్మ మనవరాలు అవంతిక్ మకేన్!



హత్య తర్వాత.... వాళ్ళ మమ్మీ డాడీలను తగలబెట్టవద్దని, మంటలకి వాళ్ళు బాధపడ్తారని అమాయకంగా ఏడ్చింది అవంతిక.

ఆ పసిదాన్ని ఓదార్చటానికి, మరిపించటానికి శంకర్‌దయాళ్ శర్మ దంపతులకి చాలాకాలమే పట్టింది. కాలంతోపాటు అవంతిక మనసులో హంతకుల పట్ల కసి, కోపం అధికమవసాగింది.

"ఆ హంతకుడు పాట్నా జైల్‌లో వున్నాడంటున్నారు... ఏదో ఒక రోజు వాడ్ని పట్టుకుని నా కసి అంతా తీర్చుకుంటా—" అంటూ చిన్ని పిడికిళ్ళు బిగిస్తోంది. తన కన్నవారి హత్యకు గవర్నమెంట్‌ను అందరూ బ్లేమ్ చేస్తారు. కానీ తను మాత్రం టెర్రరిస్ట్‌ను అంటుంది.

అయినా తను సిక్కుల వ్యతిరేకి కాదట. "నేను గురునానక్‌ని పూజిస్తూ సిక్కులని ఎలా ద్వేషిస్తాను" అని తిరిగి అడుగుతుంది.

రాజీవ్ గాంధీ, సోనియాలకి అవంతి అంటే ఎంతో ప్రేమట. అవంతికి చాక్లెట్ బాక్స్ ఇస్తూ "ఏ నియోజకవర్గం నుండి పోటీ చేస్తావ్?" అని అడిగే వారట రాజీవ్.

"నిజంగా నేను పాలిటిక్స్‌లో చేరతా. మా మమ్మీలా ధైర్యసాహసాల్ని ప్రదర్శిస్తా—" అంటూ ఎంతో గర్వంగా, స్థయిర్యంగా చెప్తోంది— ఈ పులి బిడ్డ!

పులి బిడ్డ పులిబిడ్డే అని చెప్పటానికి అవంతిక ప్రత్యక్ష నిదర్శనం!

—ఆర్డీ *